
# వైదేహీ ఐ లవ్యూ




**పార్ట్‌నర్ కోసం లైఫ్ ఇచ్చేవాడే లైఫ్ పార్ట్‌నర్ అని చెప్పే కథ**

డా. పేరాల శ్రవణ్‌కుమార్

క్లాస్ వన్ కంట్రాక్టర్ విజయ్‌కుమార్‌గారి సువిశాలమైన బంగళా అది. ఆవరణలోని పూదోటలో రాయంచలా విహరిస్తోంది ఆయన గారాలపట్టి వైదేహి. నెమలి కంఠం రంగు చుడీదార్, పంచరంగుల చున్నీ, ముట్టుకుంటే మాసిపోయే ఆమె మేని ఒంపుసొంపులు ఆ తోటకే కొత్త అందాన్ని తెస్తున్నాయి.

"పిలిచావా వ్రూటీ!" అదుర్దాగా వచ్చాడు సుబ్బారావ్. తెల్లటి డ్రిల్ ప్యాంటు, దాని మీద అంతగా మ్యాచ్ గాని గళ్ల షర్టు, పైకి దువ్విన క్రాఫ్, సాదాసీదా చెప్పులు, బ్లాక్ అండ్ వైట్ సినిమాల నాటి హీరోలా ఉండే అవతారం చూస్తే అతను ప్రీతమ్ ఇంజనీరింగ్ కాలేజి స్టూడెంట్ అంటే ఎవరూ నమ్మరు.

"ఇంకోసారి వ్రూటీ గీటీ అన్నావో" తర్జని చూపి బెదిరించింది వైదేహి.



"చంపేస్తావు అంతేగా. చిన్నప్పట్నించి పిలిచిన అలవాటు కదా వ్రూ... సారీ... వైదేహీ. ఇంతకీ విషయం ఏంటో చెప్పు. తరవాత చంపొచ్చు" అంటూ ఎదురుగా ఉన్న సిమెంటు బెంచి మీద సెటిలయ్యాడు సుబ్బారావ్.

"కాస్త ఇంపార్టెంట్ విషయమే సుబ్బూ" అతడికేసి తేరిపార చూస్తూ అంది వైదేహి.

"ఏంటో అది!"

"ఐ లవ్యూ"

అంతే. పక్కనే బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు సుబ్బారావ్.

ఆశ్చర్యం, ఆనందం, సంభ్రమం ముప్పిరిగొన్న చూపుల్తో అతడి కళ్లు మిలమిలలాడేయి.

అతని రియాక్షన్స్ చూస్తూ పగలబడి నవ్వేసింది వైదేహి.

"షాక్ తిన్నావు కదూ! నిన్న సాయంత్రం ఇదే ప్లేస్‌లో సడెన్‌గా ఇలాగే ఐ లవ్యూ చెప్పి నన్ను షాక్ తినిపించాడు రోహిత్. అదెలా ఉంటుందో నీకూ చూపిద్దామని" మధ్యమధ్యలో నవ్వుతూ పూర్తి చేసింది వైదేహి.

సుబ్బు ముఖం రంగులు మారడం స్పష్టంగా తెలుస్తోంది.

"హార్ట్ ఫీలింగ్సా! అబ్బ జోక్ చేశాన్లేవయ్యా బాబూ. అసలు నిన్ను పిలిపించిందెందుకో తెల్సా! రేపటికల్లా నా నిర్ణయం చెప్పమని రోహిత్ ఒకటే గోల. చిన్నప్పట్నించి నా ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్ నువ్వే కదా. సలహా చెప్పు. ప్లీజ్. నాన్నకి మాత్రం చెప్పకు" చిన్నపిల్లలా సతాయిస్తోంది వైదేహి.

"నీకేం అనిపిస్తే అదే చెప్పు వ్రూటీ" బలవంతంగా నవ్వుతూ కళ్లలో నీటి పొర కదలాడుతుండగా గిరుక్కున తిరిగి వెళ్లిపోయాడు సుబ్బు.

పూర్ ఫెలో. హర్ట్ అయినట్టున్నాడు. కొంపదీసి తనని నిజంగా లవ్ చేస్తున్నాడా ఏంటి? చేస్తే చెప్పచ్చుగా. ఆ మాత్రం ధైర్యం కూడా లేని వాడికి ప్రేమించే అర్హత ఉంటుందా? అఫ్‌కోర్స్. తనకే ఐ లవ్యూ చెప్పేంత దురాశాపరుడేం కాదు సుబ్బారావ్. కానీ సరదాకి తనే చెప్పేసరికి నిజమేననుకుని ఉక్కిరిబిక్కిరై ఫ్లాట్ అయిపోయేడు పాపం. సుబ్బారావు తల్లితో కలిసి ఉంటున్న తమ అవుట్ హౌస్ కేసి చూస్తూ జాలిగా అనుకుంది వైదేహి తనెక్కడ, సుబ్బూ ఎక్కడ!

అంతలోనే రోహిత్ గుర్తొచ్చాడు. రోహిత్‌కీ సుబ్బుకీ పోలికా! రోహిత్ రొమాంటిక్ లుక్స్, ఆ డ్రెస్ సెన్స్, బాణాల్లాంటి ఆ చూపులు, ఆధునిక లవర్‌బోయ్‌లకి ప్రతినిధిలా ఉంటాడు రోహిత్. మరి సుబ్బు...

మనిషి ఫర్వాలేదనిపించినా ఆ మ్యాచింగ్ లేని డ్రెస్‌లూ, ఆ కొబ్బరినూనె రాసిన జుట్టు, రాముడు మంచి బాలుడు టైపు చేష్టలూ... అబ్బ... బోర్ కొడ్తుంటాయి.

చిన్నప్పట్నుంచీ సుబ్బూ, తనూ కలిసే పెరిగినా, అతనెప్పుడూ తన కంటికి సేవకుడిలాగే కనిపిస్తాడు.



## ప్రీతి 'స్పృహ'

సొట్టబుగ్గల సుందరి ప్రీతి జింతా జనవరి 31న 34వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఈ పుట్టినరోజు సందర్భంగా తనో నిర్ణయం తీసుకుందిట. ముంబయ్‌లోని స్లమ్ ఏరియాల గురించి పట్టించుకోవాలనుకుంటోందిట. బాంద్రా ఏరియాలో తను నివసించే ఇంటికి దగ్గరలోనే భయంకరమైన మురికివాడ వుందిట. అలాగే 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమా పుణ్యమాని ముంబయ్ మురికివాడలకి అంత ర్జాతీయంగా 'పేరు' వచ్చేసింది. ఓ రకంగా మన పరువు బజారుకెక్కింది. అందుకనే మురికివాడల్లేని ముంబయ్ గురించి కలలు కంటోందిట ప్రీతి. ఇందుకు కృషి చేస్తానంటోంది. ఎలాగో మరి.

పాతకాలం మనిషిలా అనిపిస్తాడు.

సుబ్బు తండ్రి సీతారామయ్యగారు విజయ్‌కుమార్ గారికి చిన్ననాటి స్నేహితుడు. జాబ్ దొరక్క అవస్థపడుతున్న తన స్నేహితుడికి తన ఆఫీసులోనే ఎకౌంటెంట్‌గా ఉద్యోగం ఇచ్చాడు విజయ్‌కుమార్. నిజాయితీయే ఆస్తిగా బ్రతికే సీతారామయ్యంటే విజయ్‌కుమార్‌కి చెప్పలేనంత గురి. జీతభత్యాల్లేకుండా సంవత్సరానికోసారి బోనస్ రూపంలో ఎంతో కొంత ఇచ్చేవాడు స్నేహితుడికి. కానీ వారి ఒద్దికైన స్నేహాన్ని చూడలేని కాలం హార్ట్‌ఎటాక్ రూపంలో సీతారామయ్యని చిన్నవయసులోనే కబళించింది. భర్త ఆకస్మిక మరణంతో రోడ్డున పడ్డ సీతమ్మగారిని తన ఇంటి ఔట్‌హౌస్‌లో ఉండడానికి అతి కష్టం మీద ఒప్పించారు విజయ్‌కుమార్. తల్లిలేని ప్రూటీకి సీతమ్మగారే తల్లయి ఆలనా పాలనా చూసేది. అన్నయ్యలా ఆదరించిన విజయకుమార్‌కి వండి వడ్డించేది. ఇంటి పనులన్నీ చూసేది.

వైదేహికి సీతమ్మగారు ఆయాలాగా, సుబ్బు సేవకుడిలా కనిపిస్తారు. ఎలాంటి మొహమాటం లేకుండా చిన్నప్పట్నుంచీ వాళ్లిద్దరి సేవలూ పొందేది తను.

విజయ్‌కుమార్ మాత్రం సుబ్బుని ఎంతో ఆప్యాయంగా చూసేవారు. కారణం రూపంలోనూ, గుణాల్లోనూ అతను సీతారామయ్యని పోలి ఉండడమే కావచ్చు. ప్రూటీ చదువుతున్న స్కూల్‌లోనే సుబ్బునీ చేర్చారాయన. సుబ్బు చదువులో చాలా చురుకు. స్కూల్‌లో వైదేహి మీద ఈగ వాలనిచ్చేవాడు కాదు. అలాగని వైదేహి తప్పు ఉంటే నలుగురిలోనూ మందలించేవాడు. ఒక్కోసారి సుబ్బా మీద కంప్లయింట్స్ చెప్పేది డాడీకి.

"నీ తప్పులు చెప్పేవాడే నిజమైన శ్రేయోభిలాషిరా. వాడు చెప్పినట్టు విను" అంటూ తేలిగ్గా నవ్వేసేవారు ఆయన.

సైకిల్‌కి రిపేర్ వస్తే తన సైకిల్‌ని సుబ్బుకి ఇచ్చేసి తను అతని సైకిల్ తీస్కుని దర్జాగా వెళ్లిపోయేది. వైదేహికి జ్వరం వచ్చి స్కూల్ మానేస్తే, ఆ రెండు రోజులూ వైదేహి నోట్స్ సుబ్బాయే కంప్లీట్ చేయాలి. ఇలాంటివన్నీ ఆనందంగా చేసేవాడు. టెన్త్‌క్లాస్ పరీక్షల ముందు తనని టీవీ చూడొద్దని కట్టడి చేసి తనతోబాటు చదివించేవాడు సుబ్బు.

"నేనేం నీలా కష్టపడి చదవఖ్ఖర్లేదు. ఏ సీటు కావాలన్నా డాడీ కొనేస్తారు" ఉక్రోషంగా అనేది వైదేహి.

"చదువుకోవాలి గానీ చదువు 'కొన'కూడదు ప్రూటీ" అంటూ మెత్తగా చురకేసేవాడు సుబ్బా. తనకి టెన్త్‌లో, ఇంటర్లో ఆ మాత్రం మార్కులైనా వచ్చాయి అంటే అది సుబ్బు చలవే.

విజయ్‌కుమార్‌గారికి వైదేహి చదువు గురించి పట్టించుకునేంత తీరిక ఉండేది కాదు. ఎప్పుడైనా తీరిక దొరికితే సుబ్బునే అడిగే వారు. 'ఏరా! ఎలా చదువుతోంది ప్రూటీ? దానికేమయినా చెప్తున్నావా లేదా!' అంటూ.

అనుకున్నట్టే సుబ్బారావు ప్రీతమ్ ఇంజనీరింగ్ కాలేజీలో మెరిట్ సీటు సాధించాడు. విజయ్‌కుమార్ గారు మహదానందపడి స్కూటర్ కొనిచ్చారు అతనికి.

వైదేహి మాత్రం ఇంటర్ కాగానే తన టేస్ట్‌కి తగ్గట్టు ఇంటీరియర్ డెకరేషన్ కోర్సులో జాయినైంది. రోజూ స్కూటీ మీద కాలేజీకి వెళ్లొస్తుంటుంది.

సుబ్బుదీ తనదీ వేరే వేరే కోర్సులు, కాలేజీలు కావడంతో ఇప్పుడు సుబ్బు ప్రభావం తన మీద అంతగా లేదు. అలాంటి పరిస్థితుల్లోనే రోహిత్‌తో పరిచయం అయింది. అదీ చాలా రొమాంటిగ్గా.

ఆ రోజు సాయంత్రం తను కాలేజీ నుంచి ఇంటికి వచ్చి బట్టలు మార్చుకుంటోంది. సడన్‌గా ల్యాండ్ లైన్ ఫోన్ మోగింది. ఎవరబ్బా అనుకుంటూ ఫోన్ తీసింది.

"హల్లో. అయామ్ రోహిత్. ప్రీతమ్ కాలేజీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ చదువుతున్నా. మీరు వైదేహి గారేనా?" పరిచయం లేని కంఠం.

"ఊ! ఐతే! వాట్ డు యు వాంట్?" అసహనంగా అడిగింది తాను. అప్పుడప్పుడూ అలాంటి ఆకతాయి ఫోన్ కాల్స్ తనకి మామూలే.

"మీ ఇంటి అడ్రెస్ కాస్త చెప్తారా. మీతో కాస్త పర్సనల్‌గా మాట్లాడాలి" చిలిపిగా ధ్వనించాడా ఆగంతకుడు.

"ఏయ్ మిస్టర్! ఏంటి వాగుతున్నావ్. దిస్ ఈజ్ టూ మచ్. మళ్లీ ఇలాంటి కాల్స్ చేశావా.." గయ్‌మంటూ లేచింది వైదేహి.

"ఓకే మిస్. అలాగే. ఒద్దంటే చెయ్యను. మరేం లేదు. మీ సెల్‌ఫోన్ నాకు రోడ్డు మీద దొరికింది. అందులో మీ ఇంటి ఫోన్ నెంబర్ ఫీడ్ అయి ఉంటే మంచికి పోయి ఫోన్ చేశాను. మీ సెల్ మీకు వద్దంటే సరే. బై బై" అనేసి ఫోన్ కట్ చేశాడు. చూసుకుంటే నిజమే. తన సెల్‌ఫోన్ పోయింది. స్కూటీ మీద వస్తుంటే జారిపడి ఉంటుంది. అది డాడీ తనకి బర్త్‌డే గిఫ్ట్‌గా ఇచ్చింది. తనే రోహిత్‌కి కాల్ చేసి సారీ చెప్పి ఇంటికి రప్పించుకోవాల్సి వచ్చింది. బొత్తిగా అల్లరి పిల్లాడు రోహిత్. ఆరు జేబుల జీన్స్ ప్యాంటు, ఫ్లవర్ డిజైన్ షార్ట్ మోడల్ షర్టు, భుజాలమీదికి జాలువారే జుట్టు, సన్నటి మీసం, చిలిపినవ్వులు, చురుకైన చూపులు, నడకలో, మాటలో ఉట్టిపడే సిటీ స్టైల్. తొలిచూపులోనే ఐస్ అయిపోయింది తను.

తన సెల్‌ని తీరిగ్గా గిఫ్ట్ ప్యాక్ చేయించి తనకే ప్రెజెంట్ చేస్తుంటే పకపకా నవ్వింది. అతడిని మాట్లాడనిస్తే చాలు. ఆ సెన్సాఫ్ హ్యూమర్‌కి నవ్వి నవ్వి కళ్ల నీళ్లొచ్చేస్తాయి. అతను మాట్లాడుతుంటే చెవులప్పగించి వినాలనిపిస్తుంది.

రోహిత్, సుబ్బు ఇంజనీరింగ్‌లో బ్యాచ్‌మేట్స్ కానీ

బ్రాంచీలే వేరు. సుబ్బుది మెరిట్ సీటయితే రోహిత్‌ది నాలుగు లక్షలిచ్చి కొన్న సీటు. అంతే తేడా. రోహిత్ తండ్రి విశ్వనాథ్ కూడా బిల్డింగ్ కాంట్రాక్టర్ కావడం, విజయ్‌కుమార్‌తో కాస్త పరిచయం ఉండడంతో రోహిత్ వాళ్లు ఫ్యామిలీ ఫ్రెండ్స్ అయిపోయారు.

సుబ్బుని చూస్తూనే 'ఓ ఈ ముద్దపప్పా. కాలేజీలో చాలా సార్లు చూశాను' అనేశాడు రోహిత్. ఆ పేరు కరెక్ట్‌గా సూటైంది సుబ్బుకి అనిపించింది తనకి కూడా.

రోహిత్‌తో పరిచయం రోజురోజుకీ పెరుగుతూ చివరికి ఈ స్థాయికి చేరుకుంది. ఇంతకీ రేపు రోహిత్‌కి ఏం చెప్పాలి? అదే వైదేహి ముందున్న ప్రశ్న.

☆ ☆ ☆

మర్నాడు సిగ్గుతో సతమతమవుతూనే తన ప్రేమని రోహిత్‌కి వ్యక్తం చేసింది. రోహిత్ ఆనందంతో డిస్కో డాన్స్ చేసేశాడు లాన్‌లోనే.

"చెప్పేశా సుబ్బూ రోహిత్‌తో" అంది ఇంటికొచ్చాక సీక్రెట్‌గా. వెలుగుతున్న ఆమె ముఖం చెప్పకనే చెప్తోంది ఆమె ఏం చెప్పిందో.

"కంగ్రాట్స్ వైదేహీ!" నిర్మలంగా నవ్వుతూ అన్నాడు సుబ్బూ.

క్యాంపస్ సెలక్షన్స్‌లో రోహిత్‌కీ, సుబ్బుకీ బెంగుళూర్‌లో జాబ్స్ వచ్చాయి. రెండు రోజుల్లో సర్టిఫికెట్స్‌తో సహా బెంగుళూరు వెళ్లాలి, ఫైనల్ సెలక్షన్‌కి.

☆ ☆ ☆

ఆ రోజు ఉదయం విజయకుమార్‌గారు అర్జెంటు బిజినెస్ వర్క్ మీద బ్యాంకాక్ ప్రయాణమై వెళ్లారు. ఆ రోజు రాత్రే పది గంటల వేళ విపరీతమైన కడుపు నొప్పి, జ్వరం జంట సునామీల్లా వైదేహి శరీరాన్ని కుదిపేశాయి. అర్ధరాత్రివేళ అంబులెన్స్‌కి ఫోన్ చేసి హాస్పిటల్‌లో చేర్చాడు సుబ్బారావ్.

సీతమ్మగారు దగ్గరుండి అన్ని సపర్యలూ చేస్తోంది వైదేహికి. "డాడీ, డాడీ" అంటూ ఒకటే కలవరింతలు అంత జ్వరంలోనూ.


రాత్రంతా సెలైన్ ఎక్కించి ఇంట్రావీనస్ ఇంజక్షన్స్ ఇచ్చినా నొప్పి అలాగే ఉంది.

"ఎక్యూట్ ఎపెండిసైటిస్. అర్జెంటుగా సర్జరీ చేయాలి" డిక్లేర్ చేశాడు డా॥శ్రావణ్. ఆయన విజయకుమార్‌కి స్నేహితుడే.

విజయకుమార్‌గారికి ఎన్నిసార్లు చేసినా కాల్ కనెక్ట్ కావడమే లేదు.

"డోన్ట్‌వర్రీ వైదేహీ. ఇదేం పెద్ద సర్జరీ కాదమ్మా. నేనున్నానుగా" ధైర్యం చెప్పేడు డాక్టరు. సీతమ్మగారు కన్నీళ్లు దిగ మింగుకుంటూనే ప్రూటీకి ధైర్యం నూరిపోస్తున్నారు. ప్రూటీకి అసలు ఇంజక్షన్ తీసుకోవడం అన్నా చెప్పలేనంత భయం. ఇల్లంతా పరుగులు తీస్తుంది. అలాంటిది ఆపరేషన్ అనేసరికి ఏడ్చేస్తోంది. విషయం తెల్సి రోహిత్ హడావిడిగా వచ్చాడు.

"అమ్మయ్య వచ్చేశావా. డాడీ కూడా లేరు. ఎంత టెన్షన్‌గా ఉందో.






నువ్వు ఆపరేషన్ టైమ్‌లో నా పక్కనే ఉండాలి" ముందుకి వొంగి రోహిత్ చెయ్యి గట్టిగా పట్టుకుని వదలడం లేదు వైదేహి. ఇబ్బందిగా నవ్వేసి నెమ్మదిగా చెయ్యి విడిపించుకున్నాడు రోహిత్.

"సిల్లీ గాల్! అది చాలా సింపుల్ సర్జరీ అట. డాక్టర్‌తో మాట్లాడేను. తేడా వస్తే ఊరుకోనని వార్నింగ్ కూడా ఇచ్చాను. నాకు నీ సర్జరీ అయ్యేదాకా వెళ్లాలనే లేదు. కానీ ఏం చెయ్యను? బెంగుళూర్‌లో రేపే రిపోర్ట్ చేయాలి. చెయ్యలేదనుకో నెక్స్ట్ కాండిడేట్‌కి ఇచ్చేస్తారు. మంచి జాబ్ చేజారిపోతుంది. అన్నట్టు... సుబ్బారావు బయల్దేరుతున్నాడా? వాడికి కూడా రేపే ఫైనల్ సెలక్షన్"

అయోమయంగా చూస్తూ ఉండిపోయింది వైదేహి.


"అరె. ఏంటి వైదేహీ చిన్నపిల్లలా! బి ప్రాక్టికల్ యార్. నేనున్నా సరే సర్జరీ నేను చేస్తానా? డాక్టర్లూ, సిస్టర్లే కదా చేస్తారు? మేమంతా బయట కూర్చుని ప్రేయర్స్ చేయవల్సిందే. అదేదో అక్కణ్నించే చేస్తాను. నీకేం భయంలేదు. నేనొచ్చేసరికి పూర్తిగా నార్మల్ అయిపోతావు. నాకు జాబ్ రాగానే పెద్దవాళ్లకి మన ప్రేమ గురించి చెప్పేద్దాం. ఏమంటావ్?" అంటూ వైదేహి బైబై చెప్పి వెళ్లిపోయాడు రోహిత్.

అతను చెప్పేదీ నిజమే కదా. ప్రాక్టికల్‌గా ఉండాలి. రోహిత్, డాడీ కూడా ఉన్నా ఏం చేస్తారు? డాక్టర్లే కదా అంతా చేసేది. కళ్లు తుడుచుకుని తనకి తాను సర్ది చెప్పుకుంది వైదేహి.

సర్జరీ టైం దగ్గరపడుతోంది. కళ్లు మూసుకుని పడుకున్న వైదేహి నుదుట ఏదో రాసినట్టె కళ్లు

## నమిత భక్తి

పోజుల్లో మరీ రొమాంటిగ్గా వుంటుంది కాబట్టి నమిత బొత్తిగా ఎలాంటి భయభక్తులూ, సెంటిమెంట్లూ లేవని అనుకుంటే పొరపాటేనండోయ్. ఎందుకంటే- ఏమాత్రం ఖాళీ దొరికినా తన కుటుంబ సభ్యులతో హోలీడేని ఎంజాయ్ చేస్తుందిట. అంతేకాదు, రోజుకి ఒక్కసారైనా 'హనుమాన్ చాలీసా' చదవందే ఊరుకోదట నమిత. దీన్ని చదువుకోడం వల్ల తనకి మానసికంగా ఎంతో శక్తి లభిస్తుంది అంటుంది నమిత. గుడ్‌గాల్ కదూ!




తెరిచింది.

"శివాలయంలో అర్చన చేయించా ఫ్రూటీ. ఈ విభూది పెడ్తే ఇంకేం భయం ఉండదన్నారు పూజారి గారు" నుదుట విభూతి రాస్తూ సుబ్బు అంటున్న మాటలు ఎందుకో కొండంత ధైర్యాన్నిస్తున్నాయ్. ఇలా రోహిత్ చేస్తే ఎంత బావుండేది. ఒక్క క్షణం మనసు కలుక్కుమంది. అంతలోనే కామన్‌సెన్స్ మేల్కొంది.

"నీవన్నీ సిల్లీ సెంటిమెంట్స్ సుబ్బూ. అన్నట్టు నువ్వింకా బెంగుళూరు బయల్దేరలేదా?" ఆశ్చర్యంగా అడిగింది.

"నీకు సర్జరీ కదా! ఎలా వెళ్తాను" అంతే ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బు. ఇది...ఇది కూడా రోహిత్ అనాల్సిన మాటే. అంటే... రోహిత్‌కి తన మీద లవ్ లేదా? నోనో! అదేం కాదు. లవ్ లేక కాదు. హీ ఈజ్ ప్రాక్టికల్. అంతే. గట్టిగా రోహిత్‌ని సమర్థించుకుంది మనసులోనే.

"అరే! బీ ప్రాక్టికల్ యార్. మా డాడీ, రోహిత్ ఉండి చెయ్యలేనిది నువ్వేం చేసేస్తావ్? నీ ప్రాణం అడ్డు వేసి నా ప్రాణం కాపాడతావా? అనస్థీషియా ఇచ్చి సర్జరీ చేస్తావా? చిన్నప్పట్నుంచీ నువ్వింతే. నువ్వు లేకపోతే నేను బ్రతకలేనన్నట్టు బిల్డప్‌లిస్తావు. నీకిప్పుడు జాబ్ చాలా అవసరం. దయచేసి బయల్దేరు. త్యాగాలు చెయ్యకు" వ్యంగ్యంగా నమస్కారం పెడ్తూ అంది విసుగ్గా. రోహిత్ మీద అక్కసు సుబ్బు మీద చూపుతున్నానని తెలుసు ఆమెకి.

"ఓకే. వైదేహీ! అలాగే వెళ్తాను" అవమానం దిగమింగుతూ వెళ్లిపోతున్న సుబ్బుని చూస్తుంటే ఏదో చెప్పలేని ఫీలింగ్ కలిగిందామెలో.

కాసేపటికే వైదేహిని ఆపరేషన్ టేబిల్ మీదకి షిఫ్ట్ చేశారు. ఆపరేషన్ జరుగుతుండగా అనుకోకుండా మేజర్ వెసెల్ ఏదో కట్ అయింది. తీవ్ర వేగంతో ఎగజిమ్ముతున్న రక్తధారని సీనియర్ సర్జన్ అయిన శ్రావణ్ కూడా కంట్రోల్ చేయలేకపోతున్నాడు.

"పేషెంట్ బీపీ పడిపోతోంది. అర్జెంటుగా రెండు బాటిల్స్ రక్తం ఎక్కించాలి" అంటూ హడావిడి పెట్టేస్తున్నాడు అనస్థటిస్ట్ శ్రీకాంత్.

అసలే పేషెంటుది 'ఓ నెగెటివ్' బ్లడ్ గ్రూప్. చాలా రేర్. దొరకడమే కష్టం. చిన్న సర్జరీయే కదా అని బ్లడ్ రిజర్వ్ చేస్కోకపోవడం తనదే పొరపాటు. అనుకోని అవాంతరంలా ఈ బ్లీడింగ్ వచ్చి పడింది. వైదేహికేమైనా అయితే విజయ్‌కుమార్ తనని బ్రతకనివ్వడు. తర్జనభర్జన పడిపోతున్నాడు డా.శ్రావణ్.

అసిస్టెంట్ డా.ప్రకాష్ చేత ఊళ్లో అన్ని బ్లడ్ బ్యాంకులకీ ఫోన్ చేయించాడు. ఎక్కడా 'ఓ' నెగటివ్ రక్తం స్టాకు లేదు.

మళ్లీ ఓసారి చూసెళ్దామని వచ్చిన సుబ్బు పరిగెత్తుకొచ్చాడు.

"నా గ్రూప్ అదే సార్" ఆశగా అన్నాడు.

ఇష్టదైవాన్ని స్మరించుకుంటూ టెస్ట్ చేసిన డా.ప్రకాష్ ముఖం మతాబులా వెలిగిపోయింది.

"మీది సరిపోతుంది. కానీ రెండు బాటిల్స్ రక్తం ఇవ్వడం మీకు ప్రాణాపాయం కావచ్చు. సంతకం పెడతారా?" మరుక్షణంలో సంతకం పెట్టేడు సుబ్బారావు.

రక్తం ఎక్కించగానే వైదేహి బీపీ నార్మల్‌కొచ్చింది. డాక్టర్స్ ముఖాలు వికసించాయి.

"నీ ఫ్రెండ్ సుబ్బు తన ప్రాణం అడ్డువేసి నీ ప్రాణం కాపాడేడమ్మా" వైదేహి తెలివిలోకి వచ్చాక డా.శ్రావణ్ చెప్తుంటే చెంప ఛెళ్లుమని చరిచినట్టయింది వైదేహికి.

"ఏ జన్మ ఋణం రా ఇది?" అప్పుడే వచ్చిన విజయ్‌కుమార్‌గారు కన్నీళ్లతో సుబ్బును కౌగిలించుకున్నాడు.


అంతలో వైదేహి సెల్ మోగింది. "హాయ్ వైదేహీ. సర్జరీ అయిందా? నేను చెప్పానుగా అంతా బాగా జరుగుతుందని. అనవసరంగా కంగారు పడ్డావ్. నాకు జాబ్ వచ్చేసింది. కంగ్రాట్స్ చెప్పవా. పాపం సుబ్బు రానే లేదు. డల్ ఫెలో. వాడి జాబ్ ఎవరికో ఇచ్చేశారు. మన లవ్ సంగతి మీ డాడీతో చెప్పి..."

"స్టుపిడ్ రోహిత్" ఉరిమింది వైదేహి.

"లైఫ్ పార్టనర్ అంటే పార్టనర్ లైఫ్ డేంజర్‌లో ఉన్నప్పుడు వదిలేసి పారిపోయేవాడు కాదు. పార్టనర్ కోసం లైఫ్ ఇచ్చేవాడు. నీకు జాబ్ ముఖ్యమైపోయింది నాకంటే. నువ్వు చెప్పినట్టు ప్రాక్టికల్‌గా ఆలోచించినా నా ప్రాణం కాపాడిన సుబ్బుయే నా కాబోయే భర్త. అనుకోకుండా ఆ దేవుడు పెట్టిన ప్రేమ పరీక్షలో నువ్వు ఓడావు. నా సుబ్బు గెలిచాడు" సుబ్బుకేసి గర్వంగా చూస్తూ అంది వైదేహి.

అంతా వింటున్న విజయ్‌కుమార్ సుబ్బు చేతిని వైదేహి చేతిలో పెట్టి ఆనందంగా దీవించారు.

☆



## లావవుతున్న ఇలియానా!

బిక్కపల్చని భామ చక్కని 'పర్సనాలిటీ'తో కుర్రకారుని హుషారెక్కించే ఇలియానా ఇప్పుడు కాస్త లావైందని చెవులు కొరుక్కుంటున్నారు సినీజనాలు. కారణం- యోగా తెగ చేయడం వల్ల వచ్చిన అలసట తీర్చుకునేందుకు పాలు, పళ్లు లాంటివి కాస్త ఎక్కువే లాగించేస్తోందిట ఇలియానా. దాంతో బరువు పెరిగిన మాట నిజమే అని ఆమే ఒప్పుకుంటోంది. అయితే ఈమాత్రం లావు వరకూ అయితే బానే వుంటుంది. మరీ శృతిమించితేనే కెరీర్‌కి ఇబ్బంది వస్తుందనే సంగతి ఆమె గ్రహించాలి మరి!